క్లుప్తంగా

18 వరకే మద్యం షాపులకు దరఖాస్తుల స్వీకరణ



పరకాల : రిజర్వేషన్ వారీగా కేటాయించ బడిన మద్యం దుకాణాల కోసం ఈనెల 18 వరకు మాత్రమే దరఖాస్తులు స్వీకరిస్తామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కె.జగన్నాథరావు తెలిపారు. పట్టణంలోని ఆ శాఖ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పరకాల పరిధిలో 22 మద్యం దుకాణాలు ఉండగా ఎక్సైజ్ టాక్స్ చట్ట ప్రకారం స్లాబ్‌ల వారీగా 5 మద్యం దుకాణాలకు రూ.85 లక్షలు, 14 దుకాణాలకు రూ.55 లక్షలు, 3 మద్యం దుకాణాలకు రూ.50 లక్షలు ఉన్నట్లు వివరించారు. 2023–25 ఎక్సైజ్ పాలసీకి సంబంధించి రిజర్వేషన్లు కేటాయించగా దామెరకు డబ్ల్యు పీఆర్‌ఓ–27, పరకాల మున్సిపాల్టీ పరిధిలో డబ్ల్యుపీఆర్‌ఓ–036 (దుకాణం నంబర్ 06)లను ఎస్సీ కేటగిరీకి కేటాయించినట్లు తెలిపారు. మున్సిపాల్టీ పరిధిలోని డబ్ల్యుఆర్ 038 (దుకాణం నంబర్ 38), డబ్ల్యుఆర్ 038 (దుకాణం నంబర్ 9)లతోపాటు తహరాపూర్‌లోని డబ్ల్యుఆర్ 045 మొత్తం మూడు దుకాణాలను గౌడ కమ్యూనిటీకి కేటాయించగా మిగిలిన 17 దుకాణాలను జనరల్‌కు కేటాయించినట్లు వివరించారు. సంబంధిత మద్యం షాపులకు ఆసక్తి కలిగిన వ్యక్తులు ఈనెల 18 వరకు దరఖాస్తు ఫారంతోపాటు రూ.2 లక్షల డీడీ (నాన్ రీఫండబుల్). పాన్ కార్డు, ఆధార్ కార్డు, మూడు లేటెస్ట్ పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు అందజేయాలని చెప్పారు. ఏవైనా సందేహాలుంటే స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ఈటల రాజేందర్‌కు వినతి



శాయంపేట : మండలంలోని టీఎస్ఎస్పీడీసీఎల్‌లో పని చేస్తున్న అన్‌మ్యాన్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కార్మికులు హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌కు వినతిపత్రం అందజేశారు. హనుమకొండలో ఆదివారం జరిగిన భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) మెదటి రాష్ట్ర మహాసభలకు ఎమ్మెల్యే రాజేందర్ హాజరు కాగా మండలానికి చెందిన అన్‌మ్యాన్ కార్మికులు కలిసి వినతిపత్రం అందజేసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేందర్ స్పందించారని కార్మికులు మీడియాకు తెలిపారు. తమ సమస్యలను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి చొరవ తీసుకుంటానని ఎమ్మెల్యే రాజేందర్ భరోసా ఇచ్చారని కార్మికులు చెప్పారు. వినతిపత్రం అందజేసిన వారిలో కార్మికులు అరుణ్, రాజు, కరుణాకర్, లక్ష్మణ్, కిరణ్, అర్జున్, వెంకటేష్, సురేష్ తదితరులున్నారు.

మోటార్లు, వైర్లు చోరీ

ఆత్మకూరు : మండల కేంద్ర శివారులో తమ వ్యవసాయ మోటార్లు, వైర్లు శనివారం రాత్రి చోరీకి గురయ్యాయని రైతులు పలకల బుచ్చిరెడ్డి, రేవూరి రాజిరెడ్డి, కోమండ్ల శ్రీనివాస్‌రెడ్డి, కోమండ్ల చంద్రారెడ్డి, కరివేద మహేందర్‌రెడ్డి తెలిపారు. గతంలోనూ చోరీ జరిగి తాము తీవ్రంగా నష్టపోయామని వారు వాపోయారు. పోలీసులు చొరవ తీసుకుని నిందితులను గుర్తించి తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

25న యాదవ యుద్ధభేరి సభ



యుద్ధభేరి సభ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కుమారస్వామి, తదితరులు

కమలాపూర్ : ఈనెల 25న యాదవ యుద్ధభేరి సభ నిర్వహించనున్నట్లు యాదవ విద్యావంతుల వేదిక హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాక కుమారస్వామి తెలిపారు. మండల కేంద్రంలో యాదవ సంఘం నాయకులతో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో యాదవులకు సీట్లు, ఆర్థిక వాటాతో రాజ్యాధికారమే అంతిమ బాట నినాదంతో నాగోల్ ప్రాంతంలోని చింతల లక్ష్మణ్, లక్ష్మణరావు యాదవ్ ప్రాంగణంలో యాదవ విద్యావంతుల వేదిక, యాదవ సంఘాల ఐక్య కమిటీ ఆధ్వర్యంలో తలపెట్టిన యుద్ధభేరి బహిరంగ సభకు బీసీ మండల్ మనవడు, ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ సూరజ్ మండల్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. సభకు వివిధ రాజకీయ పార్టీల రాష్ట్ర అధ్యక్షులను ఆహ్వానించి యుద్ధభేరి డిమాండ్లపై వైఖరి కోరతామన్నారు. ఇప్పటికే బీఎస్పీ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిలను ఆహ్వానించామని చెప్పారు. అనంతరం యుద్ధభేరి పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

అన్ని మతాలకు ప్రాధాన్యం

● వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్



చర్చిలో ప్రార్థన చేస్తున్న ఎమ్మెల్యే రమేష్, తదితరులు

ఐనవోలు : బీఆర్ఎస్ పాలనలో అన్ని మతాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ తెలిపారు. నియోజకవర్గంలో వరుసగా రెండు సార్లు తాను గెలవడంలో క్రైస్తవుల తోడ్పాటు మరువలేనిదని ఆయన చెప్పారు. మండలంలోని గుంటూర్‌పల్లిలోని రోమన్ క్యాథలిక్ క్రైస్తవుల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే రమేష్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రమేష్ మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని మతాలకు సమ ప్రాధాన్యం ఇస్తూ అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతోందని చెప్పారు. ఆలయాలకు, మసీదులకు, చర్చిలకు భారీగా నిధులు కేటాయించిన ఏకైక ప్రభుత్వంగా గుర్తింపు పొందినట్లు తెలిపారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా అన్ని మతాల్లోని అర్హులకు సంక్షేమ పథకాలు అమలు చేయడంలో సీఎం కేసీఆర్ విశేష కృషి చేస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలోని పేదలందరిని ఆదుకోవడంలో తాను ముందుంటున్నట్లు తెలిపారు. ప్రజలందరికీ ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని, అండగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఫాదర్ జోసెఫ్, రిటైర్డ్ కమాండెంట్ మోహన్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు శంకర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జయపాల్ రెడ్డి, రైతుబంధు మండల కోఆర్డినేటర్ మునిగాల సమ్మయ్య, సర్పంచ్‌లు సునీత, రాజమణి, కుమారస్వామి, బాబు, మిద్దెపాక రవీందర్, భాస్కర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, షణ్ముఖరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫిల్మ్‌సిటీలకు దీటుగా ఫొటో షూట్

● పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



స్టూడియోను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి

దామెర : ఫిల్మ్‌సిటీలకు దీటుగా ఫొటో షూట్ ఏర్పాటు చేశారని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మండల కేంద్ర సమీపంలో ఏర్పాటు చేసిన సన్‌రైజ్ ఔట్‌డోర్ ఫొటో షూట్ యూనిట్‌ను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా నూతన హంగులతో ఫొటో షూట్ యూనిట్‌ను తీర్చిదిద్దారంటూ నిర్వాహకులను ఎమ్మెల్యే అభినందించారు. ఆకర్షణీయమైన ఇండోర్ స్టూడియో, విద్యుత్ దీపాల కాంతుల సెట్టింగులు, మినీ బోటింగ్, స్విమ్మింగ్ పూల్‌తోపాటు పలు సెట్టింగులు ఫిల్మ్‌సిటీలకు తీసిపోకుండా తీర్చిదిద్దారని తెలిపారు. వివాహ వేడుకల్లో భాగంగా ప్రీ వెడ్డింగ్ షూట్లకు ప్రాధాన్యత పెరుగుతున్న తరుణంలో హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఫిల్మ్‌సిటీలకు మించిన సదుపాయాలతో ఏర్పాటు చేసిన ఫొటో షూట్ యూనిట్‌ను ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు వినియోగించుకుని నిర్వాహకులను ప్రోత్సహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు హుస్సేన్, జిల్లా అధ్యక్షుడు లింగమూర్తి, ఎంపీపీ శంకర్. దళితబంధు చైర్మన్ గరిగె కృష్ణమూర్తి, వైస్ ఎంపీపీ జాకిర్ అలీ, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గండు రాము, ఎంపీడీఓ రవీందర్, యూత్ విభాగం అధ్యక్షుడు మెంతుల రాజు, కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ అక్తర్, నిర్వాహకులు మటికె సంతోష్, గుంటుకు రమేష్, దేవులపల్లి మహేందర్, బండి లింగమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నుంచి టిక్కెట్ ఇవ్వండి

● సీనియర్ నాయకుడు పొనగంటి మల్లయ్య



సమావేశంలో మాట్లాడుతున్న మల్లయ్య

కమలాపూర్ : రాబోయే ఎన్నికల్లో హుజూరాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే స్థానానికి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా తనకు అవకాశం ఇవ్వాలని కరీంనగర్ జిల్లా పరిధిలోని జమ్మికుంట మండలానికి చెందిన ఆ పార్టీ సీనియర్ నాయకుడు పొనగంటి మల్లయ్య సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ను కోరారు. మండల కేంద్రంలోని కమ్యూనిటీ హాల్‌లో తన సామాజిక వర్గ, కుల సంఘ నాయకులతో కలిసి ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తనకు 38 ఏళ్ల రాజకీయ అనుభవం ఉందని చెప్పారు. మాజీ మంత్రి ముద్దసాని దామోదర్‌రెడ్డి శిష్యుడిగా ప్రజలకు ఎనలేని సేవలు అందించినట్లు తెలిపారు. ముద్దసాని నాయకత్వంలో క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా, నాయకుడిగా పని చేసినట్లు చెప్పారు. కేసీఆర్ పిలుపు మేరకు బీఆర్ఎస్ పార్టీలో చేరి తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో క్రియాశీలకంగా పని చేసినట్లు తెలిపారు. తాను మొదట సింగిల్ విండో డైరెక్టర్‌గా, అనంతరం కార్మిక సంఘ నాయకుడిగా, తదనంతరం జమ్మికుంట మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా, ఎంపీటీసీగా, ప్రస్తుతం మున్సిపల్ కౌన్సిలర్‌గా పని చేస్తున్నట్లు వివరించారు. తనకు మున్సిపల్ చైర్మన్ పదవి ఇస్తానని చెప్పి మాజీ మంత్రి ఈటల రాజేందర్ మోసం చేసి స్థానికేతరుడికి ఇచ్చాడని ఆరోపించారు. ఈటల రాజేందర్ టీఆర్ఎస్ పార్టీకి వ్యతిరేకంగా ఉన్న సమయంలో తాను పార్టీ పక్షాన ప్రెస్‌మీట్ పెట్టినట్లు గుర్తు చేశారు. తనకు ఎమ్మెల్యేగా పోటీ చేసే అర్హతతోపాటు అన్ని వర్గాల ప్రజలు, వ్యాపార, కార్మిక వర్గాలు, ముఖ్యంగా రైతులతో సత్సంబంధాలు ఉన్నాయని తెలిపారు. తనకు ఒకసారి అవకాశం ఇస్తే హుజూరాబాద్ నియోజకవర్గంలో గులాబీ జెండాను ఎగరేస్తానని తెలిపారు. తనకు టికెట్ ఇప్పించే విషయంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్‌కుమార్, మంత్రులు గంగుల కమలాకర్, ఎర్రబెల్లి దయాకర్ రావు, జిల్లా అధ్యక్షులు జీవీ రామకృష్ణారావు, దాస్యం వినయ్‌భాస్కర్, రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ చొరవ తీసుకోవాలని కోరారు. సమావేశంలో మున్నూరు కాపు సంఘం మండల కోఆర్డినేటర్ ఎడ్ల వెంకటేశ్వర్లు, మండల యూత్ అధ్యక్షుడు ఎడ్ల నాగరాజు, రైతుబంధు సమితి గూడూరు అధ్యక్షుడు మామిడిశెట్టి చంద్రశేఖర్, నాయకులు జక్కుల సదయ్య, సత్తు సారంగం, గుండపు రమేష్, చిలుక రాజేందర్, కంది రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గద్దర్ సంస్మరణ సభ

ఎల్కతుర్తి : నేడు (సోమవారం) భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్‌లోని అంబేద్కర్ కూడలి వద్ద గద్దర్ సంస్మరణ సభ నిర్వహించనున్నట్లు జేఏసీ మండల చైర్మన్ డ్యాగల సారయ్య తెలిపారు. ముల్కనూర్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గద్దర్ ఆట, పాటతో ప్రజలను చైతన్యం చేయడంలో క్రియాశీలకంగా వ్యవహరించారని తెలిపారు. తెలంగాణ సాధనలో గద్దర్ కృషి మరువలేనిదని చెప్పారు. సభకు ఉద్యమకారులు, ప్రజాసంఘాల నాయకులు, గద్దర్ అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జేఏసీ నాయకులు తిరుపతి, స్టాలిన్ బేగ్, కొమురయ్య, మాడుగుల అశోక్, వెంకటస్వామి, రేణికుంట్ల భిక్షపతి, చెప్యాల ప్రకాశ్, మధూకర్, చక్రపాణి, కడెం రమేష్, దుర్గయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో గెలుపు ఖాయం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న విజయచందర్‌రెడ్డి, తదితరులు

ఆత్మకూరు : రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ గెలుపు ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, డాక్టర్ సిరంగి సంతోష్‌కుమార్ తెలిపారు. మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా మండలంలోని గుడెప్పాడ్, కొత్తగట్టు, మల్కపేట, పెద్దాపూర్, లింగమడుగుపల్లె, నాగయ్యపల్లె గ్రామాల్లో ఇంటింటికి బీజేపీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. గడచిన తొమ్మిదేళ్లలో ప్రధాని మోదీ నాయకత్వంలో చేపట్టిన పాలనను ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేస్తూ వివరించారు. ఈ సందర్భంగా విజయ్‌చందర్‌రెడ్డి, సంతోష్‌కుమార్ మాట్లాడారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ మోసపూరిత పాలన సాగిస్తున్నారని విమర్శించారు. అనేక హామీలు గుప్పించి ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చి తదనంతరం ప్రజలను విస్మరించి అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రైతుల సంక్షేమాన్ని గాలికొదిలేశారని, దళితులకు భూ పంపిణీ సహా అనేక హామీలు, పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, తదితర అమలు చేయలేదని తెలిపారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తేనే పేదలకు సుపరిపాలన అందుతుందని స్పష్టం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలతో మమేకమై కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై చైతన్యవంతం చేసి రానున్న ఎన్నికల్లో బీజేపీ గెలిచేలా చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఇర్సడ్ల సదానందం, ప్రధాన కార్యదర్శి ఉప్పుగల్ల శ్రీకాంత్‌రెడ్డి, బీజేవైఎం మండల అధ్యక్షుడు పోరెడ్డి ప్రదీప్‌రెడ్డి, నాయకులు గట్టు వేణు, కోరుకొప్పుల నాగరాజు, బండి శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీలకు చట్టసభల్లో అవకాశం కల్పించాలి



దామెర : సభకు వెళ్తున్న రమేష్, తదితరులు

దామెర : పద్మశాలి కులస్తులకు చట్టసభల్లో సముచిత అవకాశం కల్పించాలని పద్మశాలి సంఘం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ దుబాసి రమేష్ రాజకీయ పార్టీలను డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లాలోని కోరుట్లలో ఆదివారం తలపెట్టిన పద్మశాలి ఆత్మగౌరవ సభకు మండలంలోని ఊరుగొండ గ్రామానికి చెందిన పద్మశాలి సంఘం నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడారు. రాష్ట్రంలోని బీసీల్లో పద్మశాలి కులస్తులు అధిక సంఖ్యలో ఉన్నట్టు తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలో రానున్న ఎన్నికల్లో పద్మశాలి కులస్తులకు తగిన సంఖ్యలో సీట్లు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దుబాసి అనిల్, నూకల రవీందర్, దాసి సతీష్ కుమార్, గడ్డం రమేష్, దాసి శ్రీకాంత్, దాసి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరకాల : పట్టణం నుంచి సుమారు 300 మంది పద్మశాలి కులస్తులు కోరుట్ల సభకు బయల్దేరి వెళ్లారు. సభకు వెళ్లిన వారిలో పద్మశాలి సంఘం పరకాల రూరల్ అధ్యక్షుడు దాసరి భిక్షపతి ఉన్నారు.

ఆత్మకూరు : మండల కేంద్రం నుంచి పద్మశాలి సంఘం అధ్యక్షుడు వెల్దె వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు పాపని రవీందర్, న్యాతని ప్రవీణ్, కందగట్ల రాము, చిమ్మని దేవరాజు, మార్త రంజిత్, సదానందం తదితరులు కోరుట్ల సభకు వెళ్లారు.

ఐనవోలు : పద్మశాలీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించడంతోపాటు న్యాయపరమైన డిమాండ్లను నెరవేర్చాలని పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు ఆడెపు దయాకర్ రాజకీయ పార్టీలను డిమాండ్ చేశారు. మండలం నుంచి పద్మశాలి కులస్తులు భారీ సంఖ్యలో కోరుట్ల సభకు బయల్దేరగా దయాకర్ మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం మండల గౌరవ అధ్యక్షుడు గజ్జెల శ్రీరాములు, జిల్లా నాయకుడు వడిచర్ల శ్రీనివాస్, ఆడెపు భాస్కర్, విక్రం, రజనీకాంత్, పూర్ణ చందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

శాయంపేట : మండల కేంద్రం నుంచి కోరుట్ల సభకు బయల్దేరిన బస్సులను పద్మశాలీ సంఘం జిల్లా సీనియర్ నాయకులు బాసాని చంద్రప్రకాష్ జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. పద్మశాలి కులస్తులను ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. హక్కుల సాధనకు ఐక్య పోరాటాలే శరణ్యమని స్పష్టం చేశారు. రాబోయే ఎన్నికల్లో ప్రతి రాజకీయ పార్టీలు పద్మశాలి కులస్తులకు కనీసం 10 నుంచి 20 అసెంబ్లీ స్థానాలు, 3 నుంచి 5 వరకు పార్లమెంట్ స్థానాల్లో టికెట్లు ఇవ్వాలని, ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా కనీసం ఇద్దరు పద్మశాలి ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు ఇవ్వాలని కోరారు. సభకు బయల్దేరిన వారిలో నాయకులు బాసాని లక్ష్మీనారాయణ, సామల రవీందర్, వంగరి సాంబయ్య, ప్రభాకర్, బాసాని చంద్రమౌళి, దుబాసి రవి, బాసాని విద్యాసాగర్, బత్తుల రవి, బాసాని నాగభూషణం, రాజు, నవీన్, రమేష్, కైలాసం తదితరులున్నారు.

ఎల్కతుర్తి : మండల కేంద్రం నుంచి పద్మశాలి సంఘం జిల్లా కార్యదర్శి వేముల సమ్మయ్య, ప్రధాన కార్యదర్శి గుండేటి సతీష్, వేముల రవీందర్, చిదురాల వెంకటేష్, వేముల వెంకన్న, మొగిళి, ప్రసాద్, రాజేందర్, వెంకటేశ్వర్లు, సదాశివుడు, భాస్కర్, శివకుమార్, బీట్ల రవి, సుధాకర్, రమేష్ సభకు వెళ్లారు.

పేద కుటుంబాలకు అండగా ఉంటాం



హారిక కుటుంబంతో మాట్లాడుతున్న తిరుపతిరావు

కమలాపూర్ : పేద కుటుంబాలకు అండగా ఉంటానని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నాయినేని తిరుపతిరావు తెలిపారు. మండలంలోని ఉప్పల్ గ్రామానికి చెందిన కడమంచి సారయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని ఆదివారం తిరుపతిరావు పరామర్శించారు. ఈ సందర్భంగా తిరుపతిరావు మాట్లాడారు. సారయ్య కొడుకులు కుమార్, పైడి గతంలో వివిధ కారణాలతో మృతి చెందడం బాధాకరమన్నారు. సారయ్య కొడుకు పైడి కూతురు హారికకు ఉన్నత చదువుల కోసం తాను లక్ష రూపాయల సాయం అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలకు కోతకు గురైన ఉప్పల్‌లోని రేణుకా ఎల్లమ్మ ఆలయ మరమ్మతుల కోసం గౌడ కులస్తులకు రూ.50 వేలు, మండల కోఆప్షన్ సభ్యుడు ఖాజా హసనోద్దీన్ భార్య షెహనాజ్ బేగం మృతి చెందగా బాధిత కుటుంబానికి రూ.50 వేలు సాయంగా అందజేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటా జాతీయ జెండా ఎగరాలి



పరకాల : జాతీయ జెండాలతో కౌన్సిలర్ రాణి, తదితరులు

పరకాల : ఈనెల 15న ప్రతి ఇంటా జాతీయ జెండా ఎగరాలని 12వ వార్డు కౌన్సిలర్ బండి రాణి ఆకాంక్షించారు. భారత స్వాతంత్య్ర దినోత్సవ నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణంలోని అన్ని వార్డుల్లోనూ కౌన్సిలర్లు ఆదివారం ఇంటింటికీ జాతీయ జెండాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ రాణి మాట్లాడారు. ప్రతీ ఇంటిపైనా జాతీయ జెండా ఎగరేసి ఐక్యతను, సమగ్రతను చాటాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ 12వ వార్డు కమిటీ అధ్యక్షుడు ఏరుకొండ అవినాష్, నాయకులు బండి సదానందం, సమ్మయ్య, ఏరుకొండ రాజమౌళి, కోడెల శ్రీనివాస్, కేశెట్టి వెంకటేశ్వర్లు, జక్కుల కుమార స్వామి తదితరులు పాల్గొన్నారు.



శాయంపేట : గట్లకానిపర్తిలో పతాకాలను పంపిణీ చేస్తున్న సర్పంచ్ సాంబయ్య

శాయంపేట : మండలంలోని గట్లకానిపర్తి గ్రామంలో సర్పంచ్ బొమ్మకంటి సాంబయ్య ఇంటింటికీ జాతీయ పతాకాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 15న ప్రతీ ఇంటిపైనా జాతీయ జెండా ఎగరేయాలని ఆకాంక్షించారు.

అన్‌మ్యాన్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఆత్మకూరు : విద్యుత్ శాఖలో పని చేస్తున్న అన్‌మ్యాన్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని అన్‌మ్యాన్ (తాత్కాలిక) ఉద్యోగుల సంఘం జిల్లా నాయకుడు వరుణ్ కోరారు. నగరంలో ఆదివారం జరిగిన బీఎంఎస్ రాష్ట్ర మహాసభలో వరుణ్ మాట్లాడారు. ఈ మేరకు మండల కేంద్రంలో వరుణ్ మీడియాతో మాట్లాడారు. వివరాలు వెల్లడించారు. అన్‌మ్యాన్ కార్మికులు అనేక ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో పని చేస్తున్నారని తెలిపారు. జిల్లాలో అనేక మంది విద్యుదాఘాతానికి గురై మృతి చెందినా ప్రభుత్వం, ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. అన్‌మ్యాన్ కార్మికుల అన్ని సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆయన ఆకాంక్షించారు. అన్‌మ్యాన్ కార్మికుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి చొరవ తీసుకుంటామని బీఎంఎస్ నాయకులు హామీ ఇచ్చినట్లు వరుణ్ తెలిపారు. అన్‌మ్యాన్ కార్మికుల సమస్యల పరిష్కారానికి నాయకులు తోడ్పాటు అందించాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు రాజు, కరుణాకర్, లక్ష్మణ్, కిరణ్, అరుణ్, అర్జున్, వెంకటేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటికి సంక్షేమ ఫలాలు



తహరాపూర్‌లో ప్రజలతో మాట్లాడుతున్న ఎంపీపీ తిరుపతిరెడ్డి, తదితరులు

శాయంపేట : రాష్ట్రంలోని ప్రతీ ఇంటికి రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందాయని ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి తెలిపారు. మండలంలోని వసంతాపూర్, సూర్యనాయక్ తండా, కొత్తగట్టు సింగారం గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన 'ఇంటింటికి సంక్షేమ ఫలాలు' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి నాయకత్వంలో మండలం అన్ని విధాలా అభివృద్ధి చెందుతోందని చెప్పారు. అన్ని గ్రామాల్లోనూ ప్రజల అవసరాలకు అనుగుణంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. అన్ని తరగతుల ప్రజలకూ సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్లు వివరించారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాంశెట్టి లత, సర్పంచ్‌లు ముక్కెర అనూష ప్రేమ్‌సాగర్, శానం మంజుల పరమేశ్వర్, భూక్య రమేష్, పెంబర్తి సంతోష మల్లేష్, పరకాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మారెపల్లి నందం, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్‌రెడ్డి, నాయకులు రాంశెట్టి లక్ష్మారెడ్డి, ఇమ్మడిశెట్టి రవీందర్, జాలిగపు అశోక్, కోసరి గోపాల్, రవీందర్‌రెడ్డి, ప్రతాప్, దేవ్‌సింగ్, రాజు, రమేష భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే సహకారంతో అభివృద్ధి



బోర్ పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

ధర్మసాగర్ (వేలేరు) : ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజయ్య సహకారంతో వేలేరు మండల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎంపీపీ కేసిరెడ్డి సమ్మిరెడ్డి, జెడ్పీటీసీ చాడ సరిత తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు ఆదివారం వారు భూమి పూజ చేసి పనులను ప్రారంభించి మాట్లాడారు. ఎంపీపీ, జెడ్పీటీసీ నిధుల నుంచి మంజూరైన 15వ ఫైనాన్స్ నిధులతో 1,25,000లతో వేలేరులోని ఖబరస్తాన్‌లో బోర్ వేయిస్తున్నట్లు తెలిపారు. అలాగే కమ్మరిపేటలోని పల్లె ప్రకృతి వనంలోనూ రూ.1,65,000లతో బోర్ వేయిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కాయిత మాధవరెడ్డి, వైస్ ఎంపీపీ ఆంగోతు సంపత్, ఎంపీటీసీలు బాల్నె వెంకటేశ్వర్లు, ఇట్టబోయిన సంధ్య, నాయకులు జోగు ప్రసాద్, బైరి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

పరకాల : ఈనెల 5న క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన బండి లక్ష్మీ(62) వరంగల్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం.. పెద్ద రాజిపేటకు చెందిన లక్ష్మీ కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. ఆమె ఆత్మహత్యకు యత్నించగా కుటుంబీకులు ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించి మృతి చెందింది. లక్ష్మీ భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రజక సంఘం మండల కమిటీ ఎన్నిక

సంగెం : రజక సంఘం మండల కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు గౌరవ అధ్యక్షుడు మునుకుంట్ల మోహన్ తెలిపారు. గౌరవ అధ్యక్షుడిగా ఎం.మోహన్, అధ్యక్షుడిగా వెంకట్రాజం, ఉపాధ్యక్షుడుగా రమేష్, పాణి, ప్రధాన కార్యదర్శిగా యాకయ్య, సంయుక్త కార్యదర్శిగా రాజేంద్రప్రసాద్, కోశాధికారిగా కుమారస్వామి, కార్యవర్గ సభ్యులుగా శ్రీనివాస్, శంకర్, ఎల్లయ్య, అశోక్, ముఖ్యసలహాదార్లుగా ప్రభాకర్, రాములు ఎన్నికైనట్టు పేర్కొన్నారు.